# ఉభయ కౌతుకం

**మీ** పేరేమిటి?

రామతారకం!

గోవిందానికి కన్యాశుల్కంలో లుబ్ధావధాన్లు పాత్ర గుర్తుకొచ్చింది.

'రామనామతారకం. భక్తిముక్తిదాయకం'.

కొన్ని పేర్లు ప్రత్యేకంగా ఉంటాయి. ఏ రామారావో - సుబ్బారావో అని కాకుండా. ఆ ప్రత్యేకమయిన పేర్లు ఇతరుల ఎగతాళికి కూడా గురవుతాయి. తన పేరే ఉంది గోవిందం అని...

భజగోవిందం అని తనను కొందరు ఎద్దేవా చేయడం బాగా తెలుసు. భజగోవిందం - భజ గోవిందం - గోవిందం భజ మూఢమతే... అని. అందుకనే తనపేరు పూర్తిగా పలకడం మానేసి 'గోవిందు' అనీ కుదించుకున్నాడు. ప్రచారం చేసుకున్నాడు - రెండు మూడేళ్ళ పాటు అవస్థ పడి.

అక్కడితో ఏమయింది?

గోవిందా! గోవిందా! నీదేమైనా పోయిందా!? - అని ఇప్పటికీ కొందరు ఎగతాళి చేస్తూనే ఉన్నారు.

'రామతిలకం' పేరు వినగానే భజగోవిందం మనసులో ఈ ఆలోచనలన్నీ మెదిలాయి.

**శ్రీవిరించి**

* * *

తెల్లవారు జామున కురిసిన కొద్దిపాటి వానకే రోడ్లన్నీ జలమయమైపోయాయి. గుంటూరు బస్‌స్టాండ్‌లోకి వెళ్ళాలంటే పాదాలు తడుపుకుంటేగానీ కుదరదు.

నాన్‌స్టాప్ బస్ విజయువాడపోయేది సిద్ధంగా ఉంది. టికెట్ కౌంటర్ దగ్గర పది పన్నెండు మంది వరుసలో ఉన్నారు.

బస్ నీళ్ల గుంట ముందు ఆగి ఉంది.

లోపలకు అడుగు పెట్టాలనుకున్నవాడు తప్పనిసరిగా ఆ నీళ్ల గుంటలో దిగి నడవాల్సిందే. తిరుపతిలో స్వామిదర్శనానికి వెళ్లే వాళ్లకు సింహద్వారం దగ్గర విధిగా 'పాద ప్రక్షాళనం' జరిపించే ఏర్పాటు గుర్తుకొచ్చింది.

భుజానికి లగేజ్ బ్యాగ్ బరువుగా వేళ్లాడుతోంది. చేతిలో బ్రీఫ్‌కేస్. టికెట్ క్యూలో నించోవడానికి నీళ్ల గుంటలు దాటుతూ నడుస్తున్నాడు. లగేజ్ బ్యాగ్ నేలమీద పెట్టడానికి లేదు. నేల కనబడడం లేదు. అంతా నీళ్లే.

తను పడుతున్న అవస్థ చూసి, క్యూలో ఉన్న ఒక ఆసామీ 'మాష్టారూ' ఆ నోటు యిటివ్వండి. మీకూ టిక్కెట్ తీస్తాను' అన్నాడు.

గోవిందానికి ఆశ్చర్యం అనిపించింది.

తనంతతాను ఇతరులకు సహాయపడడానికి ఉత్సాహం చూపే మనిషి కనిపించడం ఈ రోజుల్లో చాలా తక్కువ!

క్యూలో యింతమంది ఉండగా తను అలా కష్టదాటు వేసి టిక్కెట్ తెప్పించుకోవడం సబబేనా అని ఒక్కక్షణం తటపటాయించాడు. తన అభిప్రాయం కోసం ఎదురుచూడకుండా ఆ ఆసామీ తన చేతిలోని నోటు లాక్కున్నాడు. గోవిందానికి ఇంక ఆలోచించే పనే లేదు.

టిక్కెట్ తెచ్చి ఇద్దరూ సీట్లో కూర్చున్న తరువాత అడిగాడు గోవిందం... అవతలి మనిషి పేరయినా తెలుసుకోకపోతే మరీ కృతఘ్నత అయిపోతుందని.

రామతారకం ఉత్సాహం ఉన్న యువకుడి లా కనిపిస్తున్నాడు. పేరు చెప్పి ఊరికే ఉండిపోవడంలో అతనికి 'ఫెయిత్' ఉన్నట్లు లేదు. 'నేను స్టేట్‌బ్యాంక్‌లో ఆఫీసర్‌గా ఉన్నానండి. కొద్దిగా పనిబడి విజయవాడ వెడుతున్నాను. మీరు లగేజ్‌తో ఇబ్బంది పడడం చూసి...'

'చాలా థాంక్స్. మీలాంటి పరోపకార పారీణులు ప్రపంచంలో కరువయిపోతున్నారు.



నాపేరు గోవిందం. తెలుగు వచ్చునుగాని, తెలుగు ప్రాంతం వదిలేసి చాలాకాలం అయింది. అన్నీ తెలిసిన ప్రదేశాలే అయినా కొత్తకొత్తగా కనిపిస్తున్నాయి.'

'క్షణానికో రకంగా మారిపోతోందండీ... మన తెలుగు దేశం'.

'ప్రపంచం అంతా అంతేలెండి. మార్పు సహజం. మారకుండా ఉండడమే ఆశ్చర్యం. ఇంతకూ ఒక గంటలో బెజవాడ చేరుకుంటామంటారా?' అన్నాడు గోవిందం.

'అందులో ఏమీ అనుమానం లేదు. ఈ నాన్‌స్టాప్ బస్‌లు ఉన్నాయి చూడండి... వీటి ధర్మమా అని ప్రయాణాలు చాలా సౌకర్యంగా తయారయ్యాయి'.

బస్‌లోకి జనం ఎక్కుతున్నారు.

వడివడిగా అన్ని సీట్లూ నిండిపోతున్నాయి.

వీళ్లిద్దరూ కూర్చున్న సీటుకి వెనుకగా ఒక ఆసామీ వచ్చాడు, నోట్లో చార్‌మినార్ బిగించి. గోవిందం అయిష్టంగా ముఖం పెట్టాడు.

"నేనూ టికెట్ కొన్నాను లెండి–' అన్నాడు ఆ చార్‌మినార్ మనిషి... గోవిందం వంక తేరిపార చూస్తూ.

గోవిందానికి ఈ డైలాగ్ అర్థం కాలేదు. రామతారకం వంక చూసాడు.

నేను అరటిపువ్వు కూర, గుత్తొంకాయ కూర అన్నిటికన్నా బాగా చేస్తానండీ... అంది కొత్తగా పెళ్లయిన అమల భర్తతో...

ఇంతకూ నేను ఇప్పుడు తిన్నది ఆ రెండిట్లో ఏమిటి? ప్రశ్నించాడు భర్త ఇబ్బందిగా మొహం పెట్టి.

'అతన్తో అట్టే మాటలు పెట్టుకోకండి–' అన్నట్లు చూసాడు అతను. 'పొద్దున్నే ముఖం కడిగినట్లున్నాడు పాపం ఆ ఆసామీ. మీరేం పట్టించుకోకండి–' అన్నాడు రామతారకం రహస్యంగా గోవిందం చెవిలో.

ఈ మాటలు అంతకన్నా అర్థం కాలేదు గోవిందానికి. అయినా గంభీరంగా కూర్చుండిపోయాడు. ఓ పోలీస్ కానిస్టేబుల్ బస్‌లోకి వచ్చారు. తిన్నగా వెళ్లి వెనుక వరుసలో చివరి సీట్ ఆక్రమించాడు.

'ప్రతి బస్‌కీ ఇలాంటి ఉల్ఫా ఖాతాలు ఒకటో రెండో తగులుతూనే ఉంటాయి–' అన్నాడు చార్‌మినార్ ఆసామీ.

గోవిందం వద్దనుకున్నా ఈ మాటలు అతని చెవిన పడుతూనే ఉన్నాయి. అతను ఇంకా ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోతున్నాడు. 'అసలు 'కంచే చేను మేయడం' అంటే ఇదే. మళ్లీ రోడ్డు మీద ప్రతి దుకాణం దగ్గరా అయిదు రూపాయిలన్నా వసూలు చేయకుండా ముందుకు అడుగు వేయడు. బస్‌లో మాత్రం టికెట్ తీసుకోకుండా దొరబాబులాగా వచ్చి కూర్చుంటాడు. ఎవడి అబ్బసొమ్మనుకుంటాడు? అందుకనే కార్పొరేషన్‌కి బోలెడు నష్టం వస్తోంది. అసలు వాళ్లనే అనాలిలెండి. వాళ్లకే నిజాయితీ ఉంటే ఇన్ని నష్టాలు ఎందుకొస్తాయి? నేను మా ఊరు ఎం.ఎల్.ఏ.కి చెప్పాను – ఈ బస్ రూట్ నాకు ఇచ్చెయ్యండి. ప్రతినెలా వెయ్యి రూపాయలు లాభం ఇస్తానని. ఊహు. వాళ్లు ఒప్పుకోరు. ప్రయివేట్ ఆపరేటర్లు ఎప్పుడూ నయం'.

అతని మాటలు ఎవరూ పట్టించుకోవడం లేదు. గోవిందం మాత్రం అప్పుడప్పుడూ అతని ముఖం వంకచూసి మళ్లీ తల తిప్పుకుంటు

న్నాడు. అతను మాట్లాడుతున్నది చాలా అసందర్భంగా, అనుచితంగా అనిపించింది. ఎవరూ అతన్ని నోరు ముయ్యమనరేం?

ఇంతలో డ్రైవర్ ట్రిప్‌షీట్ తీసుకుని బస్సులోకి వచ్చాడు. తలకాయలు లెక్కబెట్టుకున్నాడు. షీట్ చూసుకున్నాడు. ముఖం చిట్లించాడు. మళ్లీ లెక్కబెట్టాడు.

గోవిందం కూర్చున్న సీట్ వెనకదాకా వచ్చి 'ఏమండీ మీరు టికెట్ తీసుకున్నారా?' అని అడిగాడు పోలీస్ కానిస్టేబుల్‌ని ఉద్దేశించి.

'ఇదిగో టికెట్' అని తీసి చూపించాడు అతను.

డ్రైవర్ మళ్లీ తలకాయలు లెక్కపెట్టడం ప్రారంభించాడు.

చార్‌మినార్ ఆసామీ అతన్ని గమనించి 'ఇది నాన్‌స్టాప్ బస్సేనా?' అని అడిగాడు.

'ఏమని ఎక్కావు?' అన్నాడు డ్రైవర్, కౌంటింగ్ మధ్యలోంచే.

'పోలీసాయన్నే టికెట్ కొన్నావా - అని అడుగుతున్నావే! నీకెంత ధైర్యం?' అన్నాడు. చార్‌మినార్ ఆసామీ - డ్రైవర్ అతన్ని పట్టించుకోకుండా తన పని పూర్తి చేసుకుని వీల్ ముందుకు వెళ్లి బండి స్టార్ట్ చేసాడు.

'చూడండి... ఎంత అన్యాయమో! ఇంత పోయేకాలం ఎప్పుడైనా ఉందా? పోలీస్ మనిషినే టిక్కెట్టుందా అని అడుగుతున్నాడు...' అంటూ తన ధోరణి సాగించాడు చార్‌మినార్.

గోవిందానికి ఆశ్చర్యం అనిపించింది. ఇందాక 'ఉల్ఫా' టికెట్ అని ఆక్షేపణ చేసిందీ ఇతడే! డ్రయివర్ టికెట్ అడిగితే విడ్డూరంగా చెబుతున్నదీ యితడే! 'ఈ మనిషికి కన్‌సిస్టెన్సీ ఉన్నట్లు లేదే!' అన్నాడు గోవిందం రామతారకంతో. 'పొద్దున్నే డోస్ వేసాడని చెప్పాను కదా! మీరు పట్టించుకోకండి. ఏమీ మాట్లాడకండి. మిమ్మల్ని కూడా ఏమన్నా అంటాడు-' అన్నాడు రామతారకం. గోవిందం కాస్త కుదుటపడ్డాడు.

కాస్సేపయ్యాక చార్‌మినార్ ఆసామీ నాలుగయిదు కాగితాల బొత్తి గోవిందానికి ఇచ్చి 'చూడండి... రెండు వందలు లంచం ఇస్తేకానీ ఈ లైసెన్స్ దొరకలేదు నాకు' అన్నాడు.

గోవిందం ఆ కాగితాలు అందుకున్నాడు గానీ అవి ఏమిటో చూడలేదు.

'ప్రతి గాడిద కొడుకూ రూలు ప్రకారం పనిచేస్తాననేవాడే! పచ్చకాగితం చూపకపోతే కాగితం మీద కలం పెట్టడు. రూలు! రూలు! రూలు ప్రకారం పనిచేస్తే అంతకన్నా కావలసింది ఏముంది?'


గోవిందానికి ఎలాగయినా ఇతన్ని వదిలించుకోవాలనిపించింది.

'చూడండి... బస్‌లో ఏం రాసారు. అది చదవండి' - అని చూపించాడు.

'పొగ త్రాగరాదు' - అని చదివాడు ఆ ఆసామీ బడి కుర్రవాడిలాగా.

'మరి మీరే ఇందాకటి నుంచి చార్‌మినార్ దట్టించి మా ప్రాణాలు తీస్తున్నారు. రూలు ప్రకారం మీరు మాత్రం నడుచుకోనక్కర్లేదా? పైగా ప్రతిక్షణం విరామం లేకుండా ఉపన్యాసం ఇస్తున్నారు. మాకందరికీ చాలా ఇబ్బందిగా ఉంది!.

'ముందే చెప్పాను కదండీ. టిక్కెట్ కొనుక్కున్నానని. నాకు అన్నిటికీ లైసెన్స్ ఉంది'.




'టికెట్ – ప్రయాణం చేయడానికి లైసెన్స్ ఇస్తుంది. సిగరెట్లు తాగడానికీ, ఉపన్యాసాలు ఇవ్వటానికీ కాదు–' అన్నాడు గోవిందం.

'అయితే ఏమంటారు?'

– మిమ్మల్ని మాట్లాడవద్దని చెబితే విన్నారు కాదు. అన్నట్లుగా చూచాడు రామతారకం.

'ఏమీ అనను. మెదలకుండా కూర్చోండి–' అని ఆ కాగితాలు అతనికి వాపసు చేసాడు.

కాగితాలు జాగ్రత్తగా అందుకుంటూనే 'మీకు కోపం వచ్చినా క్షమించమని అడగను. కాని ఈ దేశంలో 'గవర్నెన్స్' ఉన్నదంటే నేను మాత్రం నిలువుగా నరికినా ఒప్పుకోను–' అన్నాడు చార్‌మినార్.

గోవిందం ఏమీ మాట్లాడలేదు. రామ తారకం మటుకు ఉలిక్కిపడ్డట్లు నటించాడు. కానీ అతని ముఖంలో 'నువ్వు ఒప్పుకుంటే ఎంత. ఒప్పుకోకపోతే ఎంత? కోట్ల కొద్దీ ఉన్న లింగాల్లో నువ్వో బోడి లింగానివి' అన్న భావం మటుకు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

బస్ ఈసరికి మంళగిరి చేరుకుంది.

నాన్‌స్టాప్ గనుక ఆగదు. రయ్‌మని పోతూ నే ఉంది. కొండ బ్యాక్‌గ్రౌండ్‌లో దేవాలయ గోపురం ఎత్తుగా భారీగా అగుపిస్తోంది. చార్ మినార్ ఆ గోపురానికి – దేవాలయ స్వామికి – కళ్లు మూసుకుని, చెవులు వాయించుకుని దణ్ణం పెట్టాడు. అతని పెదవులు ఏదో గొణు గుతున్నాయి. పూర్తి స్వగతమే.

గోవిందం అతన్ని వింతగా చూస్తున్నాడు.

ఎంత దైవభక్తి!

ఈ దేశంలో భక్తులు కానివాళ్ళు ఎవరూ లేరు. కాకపోతే దేనికి భక్తులు? – అనేదే ముఖ్యమైన పాయింట్. కొందరు డబ్బుకు భక్తులయితే కొందరు రాజకీయాలకు. నిజ మయిన నికార్సయిన సంఖ్య మాత్రం తగ్గి